క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ పండుగను పురస్కరించుకొని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డా. ఎస్.సరోజ నమ్మ శనివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక నలందా ఆటోస్టాండ్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో పలువురికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మనకు ఉన్నదాంట్లో కొంత మేర సాయం చేసి పేదలను ఆదుకుందామన్నారు. మానవ సేవయే మాధవ సేవ అనే నినాదంతో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి

హన్వాడ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో నష్టపోయిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వం రూ.లక్ష పరిహారం ఇవ్వాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కొండా బుచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న నిరుద్యోగమార్చ్ నిర్వహిస్తున్నామని.. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి గడియారం చౌరస్తా వరకు ర్యాలీ ఉంటుందన్నారు. నిరుద్యోగులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయిందని.. బాధ్యులైన మంత్రి కేటీఆర్‌ను వెంటనే భర్తరఫ్ చేసి సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని పేర్కొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



కోయిల్‌కొండ: మండలంలోని చందాపూర్‌కు చెందిన మొగులయ్యకు అత్యవసర చికిత్స నిమిత్తం నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రూ.రెండు లక్షల ఎల్‌ఓసీని శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబసభ్యులు బాలయ్య పాల్గొన్నారు.

టార్గెట్‌బాల్ జట్ల ఎంపిక



కోయిల్‌కొండ: మండలంలోని గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం టార్గెట్‌బాల్ సీనియర్ మెన్, ఉమెన్ జట్లను ఎంపిక చేసినట్లు టార్గెట్‌బాల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఉమాశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌ఐ సతీష్ హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు చదువులో కూడా రాణిస్తారన్నారు. తక్కువ సమయంలో ఎక్కువమంది క్రీడాకారులను తయారు చేసిన టార్గెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు, టార్గెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, వంశీ, భాస్కర్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై ధాన్యం ఆరబోస్తే చర్యలు



మిడ్జిల్: ప్రధాన, అంతర్గత రహదారులపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ హెచ్చరించారు. గత వర్షాకాలంలో వేముల రోడ్డుపై ఓ వ్యక్తి మృతిచెందారని.. రహదారులపై ధాన్యం ఆరబోయవద్దని రైతులకు ఇప్పటికే పలుమార్లు సూచించామని తెలిపారు. మండల రైతులు ఈ విషయాన్ని గమనించాలని ఎస్‌ఐ సూచించారు.



ఒబేదుల్లా కొత్వాల్‌కు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



జడ్చర్ల పాతబజార్ ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి



భూత్పూర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



హన్వాడలో..

ఈద్ ముబారక్..

- ఈద్గాల వద్ద ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు
- పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా శనివారం ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కొత్త దుస్తులు ధరించి ఈద్గాలకు ఊరేగింపుగా చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాత పాలమూరులోని ముస్లిం సోదరులు మోమిన్‌వాడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి న్యూగంజ్ సమీపం వానగుట్టపై ఉన్న రహమానియా ఈద్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాకేంద్రంతో పాటు పరిసర గ్రామాల ముస్లింలు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఖౌమి ఏకతా కమిటీ ఆధ్వర్యంలో పండుగ శుభాకాంక్షలు..

ఖౌమి ఏకతా కమిటీ ఆధ్వర్యంలో ఈదుల్ ఫితర్ నమాజు అనంతరం ఈద్గా ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద పలువురు ప్రముఖులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ అబ్దుల్ రహమాన్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ వెంకన్న, ఆయా పార్టీల నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, జి.మధుసూదన్‌రెడ్డి, ఎన్పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్, లక్ష్మణ్‌యాదవ్, సీజే బెనహర్, రవిప్రకాశ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

➩ జడ్చర్ల పాతబజార్ ఈద్గావద్ద ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న ఈద్గా వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, పలువురు వార్డు కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

➩ భూత్పూర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



జిల్లాకేంద్రంలోని ఈద్గా నుంచి బయటకు వస్తున్న ముస్లిం సోదరులు



దేవరకద్ర మండలం కౌకుంట్లలో..



అడ్డాకులలో..



జిల్లాకేంద్రంలో వైఎస్సార్‌టీపీ నాయకుడు రవిప్రకాశ్



దేవరకద్రలో ఈద్గా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు



చిన్నచింతకుంట ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు



మిడ్జిల్‌లో..



మహబూబ్‌నగర్‌లో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



బాదేపల్లి ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మూసాపేట ఈద్గా వద్ద..



కోయిల్‌కొండ ఈద్గా దగ్గర..



గండేడ్ మండలం వెన్నాచేడ్‌లో..



హన్వాడ ఈద్గా వద్ద..

సమస్యలు పరిష్కరించేదాకా ఆందోళనలు

జడ్చర్ల: ఐకేపీ వీఓఏల వేతనాలు పెంచి న్యాయం చేయాలని, అప్పటిదాకా ఆందోళనలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె శనివారం 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా సంఘాల బలోపేతానికి వీఓఏలు కృషి చేస్తున్నారని.. వారి సేవలకు ప్రతిఫలంగా రూ.26 వేల వేతనం చెల్లించాలని, అర్హులైన వారిని సీసీలుగా నియమించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. ప్రత్యేక యూనిఫామ్స్‌తో పాటు గుర్తింపుకార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీఓఏలు బాలమణి, జంగమ్మ, స్వరూప, సరస్వతి, ఫాతిమా, రమాదేవి, వసియాబేగం, సరిత, గౌతమి, అలివేలు, కల్పన, యాదమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య

గొప్ప దార్శనికుడు లెనిన్



మహబూబ్‌నగర్ న్యూటౌన్: మార్క్స్ ఎంగెల్స్ రాసిన కార్మిక సిద్ధాంతాన్ని సమాజానికి అందించిన గొప్ప దార్శనికుడు లెనిన్ అని సీపీఎం సీనియర్ నాయకుడు కిల్లె గోపాల్ కొనియాడారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో లెనిన్ 153వ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లెనిన్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆయన ఆశయాల సాధనకు కార్మికవర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రాములు, రాష్ట్ర నాయకుడు వెంకట్రాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, మోహన్ పాల్గొన్నారు.

దాడి : కేసునమోదు

మహమ్మదాబాద్: మొదటి భార్య, భర్త కలిసి రెండోభార్యపై దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలోని చిన్నాయపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుక్కల లాలయ్యకు ఇద్దరు భార్యలు ఉండగా మొదటి భార్య వెంకటమ్మతో కలిసి ఉంటున్నాడు. ఇదే తరుణంలో రెండోభార్య చంద్రకళతో గొడవ మొదలైంది. దీంతో శనివారం కోపోద్రిక్తులైన భార్యాభర్తలు చంద్రకళపై కర్రతో దాడిచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

మిడ్జిల్: మండలంలోని కంచన్‌పల్లి వీఆర్‌ఏ కృష్ణయ్య శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి రూ.10 వేల నగదును ఆర్‌ఐ రామాంజనేయులు వెంట పంపించి బాధిత కుటుంబానికి అందజేశారు.

నేడు బసవ జయంతి

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో ఆదివారం బసవ జయంతి నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటి ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటలకు గ్రామంలోని బసవేశ్వరుడి విగ్రహం వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందని.. పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు ప్రహ్లాదరావు పాల్గొంటారన్నారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

వీఓఏల సమ్మెకు దూరం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సీఐటీయూ అనుబంధ వీఓఏల సంఘం చేస్తున్న సమ్మెకు బీఆర్‌ఎస్‌కేవీ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘానికి ఎలాంటి సంబంధం లేదని బీఆర్‌ఎస్‌కేవీ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా నర్సింహులు తెలిపారు. సమ్మెకు తమ సంఘం దూరంగా ఉందని శుక్రవారం డీఆర్డీఓ యాదయ్యకు వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. రాష్ట్ర కమిటీ తీర్మానం మేరకు వీఓఏలు గ్రామస్థాయిలో యథావిధిగా విధులు నిర్వర్తిస్తారని వివరించారు.

25న జిల్లా సెమినార్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహనీయుల జయంతిల సందర్భంగా ఈ నెల 25న నిర్వహించే జిల్లా సెమినార్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకట్రాములు కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. భారత రాజ్యాంగం పెను ప్రమాదంలో పడిందని.. మనుధర్మ శాస్త్రం ఉండగా రాజ్యాంగం పనికిరాదంటున్న వారే దేశాన్ని పాలిస్తున్నారని ఆరోపించారు. నేటి పాలకుల వైఖరి బడుగు, బలహీనవర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని.. రాజ్యాంగ వ్యవస్థలోని ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 25న నిర్వహించే సెమినార్‌లో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాణిక్యంరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కడియాల మోహన్, సీఐటీయూ జిల్లా కోశాధికారి చంద్రకాంత్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల: బంధువుల ఇంటికి వచ్చిన యువతి అదృశ్యమైన ఘటన జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. బూరెడ్డిపల్లికి చెందిన కాట్రావత్ అనురాధ జడ్చర్లలోని బంధువుల ఇంటికి 15 రోజుల కిందట వచ్చింది. శుక్రవారం రాత్రి నుంచి కనిపించకుండాపోవడంతో తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాహుల్ అనే యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొనడంతో కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.



రహదారులు జలమయం



టీచర్స్‌కాలనీ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో రహదారిపై నిలిచిన వర్షపునీరు



వనటౌన్ వద్ద ప్రధాన రహదారిపై నిలిచిన మురుగు తొలగిస్తున్న పుర పారిశుద్ధ్య సిబ్బంది



భూత్పూర్ ప్రధాన రహదారి పక్కన చెత్తను తొలగిస్తున్న పుర కార్మికుడు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో పాటు మురుగు కాల్వలు పొంగి పొర్లాయి. గల్లీల్లోని రహదారులపై మురుగు పేరుకుపోయింది. శనివారం సాయంత్రం వరకు అలాగే ఉండటంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికీ పలుచోట్ల వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ప్రధాన రోడ్లపై మురుగును పారిశుద్ధ్య కార్మికులు తొలగించినా గల్లీలపై దృష్టి సారించలేదు.

